# దోమలు బాబోయ్ దోమలు!

- పట్టణంలో మురికి కూపాలుగా ఖాళీ స్థలాలు
- వృద్ధి చెందుతున్న దోమలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



మూలనపడిన ఫాగింగ్ యంత్రాలు (ఫైల్)

**రామచంద్రపురం:** చీకటి పడితే చాలు రోడ్డు మీద నిలుచేందుకు పట్టణవాసులు భయపడుతున్నారు. దోమల పెరిగిపోయి కనీసం రోడ్డు మీద ఉండేందుకు కూడా వీలులేకుండా కుట్టేస్తున్నాయి. రాత్రిళ్ల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పెరుగుతున్న దోమలు, సంచరిస్తున్న పందులతో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలిచిపోయి మురికి కూపాలుగా మారుతున్నాయి. అవి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. పిల్లావారి వీధి, అంకవారి వీధి, హౌసింగ్‌బోర్డు కాలనీ, కేఎస్‌ఆర్ నగర్, చప్పిడివారిసావరం, తోటవారి వీధి, సూర్యనగర్ తదితర ప్రాంతాలలో గల ఖాళీ స్థలాలు మురికి కేంద్రాలుగా మారాయి. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండి దోమలు పెరిగి, పందులు సంచరించి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

**కానరాని చర్యలు**

పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో మురుగునీటి కాలువలు లేక ఆయా కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డ్రైన్ల నుంచి మురుగునీరు పారక పోవడంతో చుట్టూ పక్కల ఉన్న మున్సిపల్ ఖాళీ స్థలాల్లోనికి మురుగునీటిని వదడంతో అవి మురుగు కూపాల్లా మారుతున్నాయి. ఆయా ప్రదేశాలలో గల నీటిలో దోమలు వృద్ధి చెందకుండా శీతాకాలంలో మున్సిపల్ అధికారులు గతంలో గాంబూషియా చేపలను సైతం వదిలివారు. కానీ ఈ సారి అటువంటి చర్యలు కానరాకపోవడంతో దోమల పెరుగుదల వృద్ధి చెందుతోంది.

**మూలకు చేరిన ఫాగింగ్ మెషీన్లు**

గతంలో వర్షాకాలంతో పాటుగా శీతాకాలంలోను ఫాగింగ్ మెషీన్లతో దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం ఫాగింగ్ మెషీన్లు మూలకు చేరాయి. పట్టణంలో దోమల పెరగకుండా చర్యలు శూన్యంగానే ఉన్నాయి.

**ప్రతి నెల రూ.25లక్షలు ఖర్చు ?**

దోమల భారీ నుంచి రక్షించుకునేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పట్టణంలో 17,500 కుటుంబాలున్నాయి. పట్టణంలోని 28 వార్డుల్లోను దోమల సమస్య అధికంగా ఉంది. ఆయా కుటుంబాలకు నెలకు దోమల బారి నుంచి రక్షించుకొనేందుకు కాయిల్స్, ఇతర పరికరాల కొనుగోలు చేసేందుకు నెలకు సుమారుగా రూ.200 చొప్పున ఖర్చు పెడుతుంటే నెలకు మొత్తం పట్టణంలో ప్రజలకు దోమల ఖర్చు సుమారు రూ.25 లక్షలు వరకు ఖర్చుపెడుతున్నట్టు అంచనా.

**శాఖల మధ్య సమన్వయ లోపం**

మున్సిపాలిటీ, ఆరోగ్య శాఖల మధ్య సమన్వయలోపంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మలేరియా, ఫైలేరియా నివారణ శాఖల ఆధ్వర్యంలో దోమల నివారణకు మున్సిపాలిటీ అధికారులతో కలిసి చర్యలు తీసుకోవాల్సి ఉంది. దోమలను లార్వా దశలో అరికట్టేందుకు పిచికారీ చేసే మందును మలేరియా, ఫైలేరియా శాఖ(ఎన్ఎఫ్‌సీపీ యూనిట్) ద్వారా సంబంధిత అధికారులు సప్లయి చేయాల్సి ఉంది. దీనిని మున్సిపాలిటీ సహకారంతో ఆశాఖ అధికారులు పట్టణంలోని డ్రైనేజీల్లో దోమలు పెరగకుండా నివారించాల్సి ఉంది. కానీ సంబంధిత యూనిట్‌కు చెందిన హెల్త్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఉందా లేదా అనేది తెలియదు. గతంలో ఉండే మలేరియా నివారణ కార్యాలయాన్ని తొలగించి అన్న క్యాంటీన్ నిర్మించారు. తిరిగి మలేరియా, ఫలేరియా నివారణకు చెందిన ఎన్ఎఫ్‌సీపీ యూనిట్‌ను తిరిగి ఏర్పాటు చేసే నాథుడు లేకుండా పోయారు. దీంతో అటు వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపాలిటీ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో దానిని పట్టించుకునే వారు కరువయ్యారు. దోమలు విజృంభిస్తుండంతో జ్వరపీడితుల సంఖ్య రోజుకు రోజుకు పెరుగుతూ వస్తోంది. దోమలు విపరీతంగా పెరగడంతో పాటుగా కలుషిత నీటిని సేవించడం ద్వారా జ్వరాలు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

### అప్రమత్తంగా ఉండాలి



జర్వాల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కాసి చల్లార్చిన నీటిని తీసుకోవాలి. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు ఉండకుండా చూసుకుని దోమల లార్వా నివారణకు చర్యలు తీసుకోవాలి. వాటర్ ట్యాంకుల్లో వారికి ఒక సారి శుభ్రం చేసి నీటిని మార్చుకోవాలి. ఇంటి వద్ద ఉన్న డ్రైనేజీల్లో కిరోసిన జల్లుకోవడం ద్వారా కొంత వరకు దోమలు నివారించుకుని జ్వరాల బారిన పడకుండా ఉండవచ్చును.

– డాక్టర్ ప్రవీణ్ , ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

## క్లుప్తంగా

### వెదురుమూడిలో తాగునీరు వృథా



వెదురుమూడిలో కుళాయి నుంచి వృథాగా పోతున్న నీరు

**కపిలేశ్వరపురం:** వెదురుమూడి పంచాయతీ వీధిలో తాగునీటి కుళాయికి లీకేజీలున్నాయి. పైపులైన్ నుంచి నీరు వృథాగా పారుతోంది. తాగు నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీని అరికట్టాల్సిన అవసరముంది.

### శీలలో పంటకోత ప్రయోగం



శీలలో పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

**కాజులూరు:** వరి సాగులో రైతులు అవసరాన్ని మించి ఎరువులు, రసాయన మందులు వినియోగించకుండా ఖర్చులు తగ్గించి, నాణ్యమైన దిగుబడి సాధించినప్పుడే ఆశించిన నికర ఆదాయాన్ని పొందగలుగుతారని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శీలలో ఆదివారం వ్యవసాయాధికారులు పంటకోత ప్రయోగం నిర్వహించారు. సగటున ఎకరానికి 75 కేజీల చొప్పున 36 బస్తాలు దిగుబడి వచ్చిందన్నారు.

### భీమేశ్వరస్వామిని దర్శించిన జిల్లా జడ్జి



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వేదాశీర్వచనం అందుకుంటున్న జిల్లా జడ్జి గంధం సునీత

**రామచంద్రపురం రూరల్:** ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జడ్జి గంధం సునీత ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమె భీమేశ్వర స్వామిని, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం బేడా మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

### వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

**కాజులూరు:** గ్రామాల్లో అంటువ్యాదులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది వైద్య బిరాలను ఎర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు, తణుకువాడ మాజీ ఎంపీటీసీ పితాని సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్ తదితరులు కోరుతున్నారు. ఆదివారం గ్రామంలో వారు విలేఖరులతో మాట్లాడుతూ వర్షాకాలం కారణంగా గ్రామంలో అపారిశుధ్య తలెత్తి అంటువ్యాదులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. గతంలో వర్షాలు సమీపించిన వెంటనే గ్రామంలో అపారిశుధ్యం తలెత్తి పలువురు డెంగీ, విషజ్వరాల బారిన పడ్డారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, వైద్యశిబిరాలను ఎర్పాటు చేయాలని కోరారు.

### ఇంటింటికీ మంచినీటి సరఫరా



హసన్‌బాదలో ఆటోలో మంచినీరు సరఫరా చేస్తున్న సర్పంచ్ సతీష్‌రావు

**రామచంద్రపురం రూరల్:** హసన్‌బాదలో జల జీవన్ మిషన్ పనుల్లో భాగంగా మంచి నీటి పైపులైన్ పనులు జరుగుతున్న కారణంగా ప్రజలకు సురక్షిత మంచినీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తడంతో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం ఆటోలో మంచినీటి క్యానులతో ఇంటింటికి మంచి నీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

**పి.గన్నవరం:** స్థానిక అక్విడెక్టు వద్ద ఉన్న ఇసుక ర్యాంపు నుంచి శనివారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు వీఆర్వో పి.నర్సింహరావు తెలిపారు. దీనిపై తహసీల్దార్ తదుపరి చర్యలు తీసుకుంటారని ఆయన వివరించారు. పి.గన్నవరం ర్యాంపు నుంచి ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా పడవలపై ఇసుకను తెచ్చి ట్రాక్టర్లపై తరలిస్తుండగా అధికారులు అడ్డుకుని ఇసుకను అన్‌లోడ్ చేయించిన విషయం విధితమే. ఆ ఇసుకను అర్థరాత్రి ఒక ట్రాక్టర్‌పై తరలిస్తుండగా అధికారులు పట్టుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

## పాదయాత్రగా శ్రీశైలానికి శివస్వాములు



రాయవరం నుంచి పాదయాత్రగా శ్రీశైలం వెళుతున్న శివ స్వాములు

**రాయవరం:** రాయవరానికి చెందిన ముగ్గురు శివ స్వాములు ఆదివారం శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి దర్శనానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. గ్రామానికి చెందిన గుడాల సూరిబాబు గురుస్వామి ఆధ్వర్యంలో మల్లిపాల అలీష్, నల్లమిల్లి అచ్చిరెడ్డి శివ స్వాములు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. తొలుత వారు స్థానిక అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు గురుస్వామి మాట్లాడుతూ 15వ సారి కాలినడకన శ్రీశైలం వెళుతున్నట్టు తెలిపాడు. పాదయాత్రకు 15 రోజుల సమయం పడుతుందని సూరిబాబు తెలిపాడు. పాదయాత్రలుగా వెళ్తున్న శివస్వాములకు మిగిలిన శివస్వాములు వెలుగుబంట్ల గోపి, మల్లిడి వెంకటరెడ్డి, రావాడ రామకృష్ణ, గోవిందు, కేతా శ్రీను, కుక్కల వీరంశెట్టి వీడ్కోలు పలికారు.

## కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



మండపేటలో వ్యాసరచన పరీక్ష రాస్తున్న విద్యార్థులు



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో తాము వేసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

**మండపేట:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పట్టణంలో కొనసాగుతున్నాయి. ఈ నెల 14న ప్రారంభమైన వారోత్సవాలు ఆదివారం నాలుగో రోజుకు చేరాయి. మండపేట శాఖా గ్రంథాలయాధికారి ఎస్.పూర్ణమ్మ ఆధ్వర్యంలో స్థానిక వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుడు ఎల్. శ్రీనివాసరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ నెల 20 వరకూ వారోత్సవాలు కొనసాగుతాయని ఆఖరి రోజున ముగింపు వేడుకలు నిర్వహించి ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని పూర్ణమ్మ తెలిపారు.

**కపిలేశ్వరపురం:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కపిలేశ్వరపురం గ్రంథాలయంలో డ్రగ్స్ రహిత సమాజం ఆవశ్యకతపై విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో జూనియర్స్ విభాగంలో 'గ్రామీణ వాతావరణం' సీనియర్స్ విభాగంలో 'డ్రగ్స్ రహిత సమాజం' అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు 20న వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులను అందజేయనున్నట్టు గ్రంథాలయాధికారి తెలిపారు.

## ఐక్యతకు ప్రతీక కార్తికం



కపిలేశ్వరపురం శెట్టిబలిజ వన సమారాధనలో సత్కారం పొందిన ఎమ్మెల్సీ తోట

**కపిలేశ్వరపురం:** ఐక్యతకు ప్రతీకగా కార్తిక మాసంలో నిర్వహించే వన సమారాధనలు నిలుస్తాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కపిలేశ్వరపురం గ్రామంలోని నాలుగు శెట్టి బలిజ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కార్తికమాస వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలాకృష్ణ హాజరయ్యారు. నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు గొల్లపల్లి సోనియా తదితరులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు జిత్తుక మల్లికార్జునుడు, పితాని సూర్యచంద్రరావు, గుత్తుల శివ, కట్టా మురళీ, బొక్కా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మండపేటలో కోర్టు ఏర్పాటు చేయాలి

**మండపేట:** నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష మేరకు మండపేటలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్, న్యాయవాది కేవీవీ సాయిరామ్ కోరారు. ఈ మేరకు టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాయిరామ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణలు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల కోరికను, న్యాయవాదులు వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని మండపేటకు కోర్టు వచ్చేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు.

## విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



ద్రాక్షారామ గ్రంథాలయంలో తాము వేసిన చిత్రాలు చూపుతున్న విద్యార్థులు

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో ఆదివారం పర్యావరణాన్ని కాపాడుదాం అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ హైస్కూల్ హిందీ ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు విద్యార్థులకు పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. గ్రంథాలయ అధికారి ములంపాక వీర సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ద్రాక్షారామ భీమేశ్వరుని సన్నిధికి పోటెత్తిన భక్తులు



ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి అభిషేకాలు



క్యూలో వేచి ఉన్న భక్తులు

**రామచంద్రపురం రూరల్:** కార్తిక మాసం ఆదివారం కావడంతో ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండి భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని అశ్వద్ధ నారాయణ వృక్షం వద్ద కార్తిక దీపాలు వెలిగించుకున్నారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయించారు. సుమారు 30 వేల మంది ఆదివారం స్వామివారిని దర్శించుకున్నారు.. ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు తొక్కిసలాటలు లేకుండా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించారు.

**పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ**

ద్రాక్షారామ పీవీఆర్ హైస్కూల్ 1988–89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సుమారు 5 వేల మందికి పులిహోర ప్రసాదం, మంచినీళ్లు అందజేశారు. కార్యక్రమంలో పసుమర్తి రంగనాయకులు, తుమ్మూరి రాంబాబు, చిక్కాల నాగబాబు, వాసంశెట్టి బాపూజీ తదితరులు పాల్గొన్నారు.



శ్యామ్ అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ

## వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

**రావులపాలెం:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.12,500 చెక్కును సాయంగా అందజేశారు. గ్రామానికి చెందిన ఆవిడి వెంకన్న 15 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలికి తీవ్ర గాయం కావడంతో రాజమహేంద్రవరం ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. పూర్తిగా కోలుకోవడానికి మరో ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో సభ్యులు వెంకన్న ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా ఆపరేషన్‌కు రూ.12,500 చెక్కు అందజేశారు.

## పంచాయతీ కార్యదర్శుల ఫోన్ నంబర్లు

**మండపేట మండలం**

| | | |
|---|---|---|
| ద్వారపూడి | ఏవీవీ రమణ | 9951566777 |
| ఇప్పనపాడు | ఎస్‌వీ సుబ్బారావు | 9948255111 |
| కేశవరం | ఎన్ సుబ్బారావు | 9989902498 |
| మారేడుబాక | బి వరప్రసాద్‌బాబు | 9951548999 |
| మెర్నిపాడు | జి రాజు | 7997681535 |
| పాలతోడు | కె.వరప్రసాద్ | 9133215443 |
| తాపేశ్వరం | చక్రధరరెడ్డి | 9390332444 |
| వెలగతోడు | వేగ్నేశ్న వి.రామకృష్ణరాజు | 9866167888 |
| వై సీతానగరం | పెనుమాళ్ల జీవీఏ స్వామిరెడ్డి | 8186918678 |
| ఏడిద. | పి.శ్రీనివాస్ | 9951432999 |
| జెడ్.మేడపాడు | వీ అమర్‌నాథ్ చౌదరి | 9948412666 |
| అర్తమూరు | అనిల్‌కుమార్ | 9951268999 |

## అధికారుల ఫోన్ నంబర్లు

**మండపేట మండలం**

| | | |
|---|---|---|
| తహసీల్దార్ | పి.తేజే శ్వరరావు | 9849903903 |
| ఎంపీడీవో | కె. సత్యనారాయణమూర్తి | 9391973013 |
| ఈవోఈఆర్డీ | డి. శ్రీనివాస్ | 9951657999 |
| మున్సిపల్ కమిషనర్ | టీవీ రంగారావు | 9849905809 |
| ఎంఈవో–1 | నాయుడు రామచంద్రరావు | 9440511749 |
| ఎంఈవో–2 | సీహెచ్‌వీ సోమిరెడ్డి | 9441145835 |
| మండల ఇంజనీరింగ్ అధికారి | వి. నాగేశ్వరరావు | 8977115105 |
| ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ | డి. చైతన్యకుమారి | 9100121182 |
| ఆర్ అండ్ బీ ఏఈ | టీవీఎస్ సూర్యనారాయణ 9440818538 | |
| ఎలక్ట్రికల్ ఏఈ | బి. రవికుమార్ | 9440812648 |
| హౌసింగ్ ఏఈ | పీవీవీ సత్యనారాయణమూర్తి | 7093930491 |
| ఇరిగేషన్ ఏఈ | అజీజ్ | 8500786756 |
| వ్యవసాయాధికారి | కె. ఏసుబాబు | 8331056558 |
| మత్స్యశాఖాధికారి | విల్ల రమణరావు | 8331953607 |
| ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో | వీవీవీ సత్యనారాయణమూర్తి | 7702072569 |
| రూరల్ ఎస్ఐ | శివకుమార్ | 9440797592 |
| వెలుగు ఏపీఎం | కె.రవిరాజు | 9849901695 |
| సీడీపీవో | గజలక్ష్మి | 6302169085 |
| ఐసీడీఎస్ సూపర్‌వైజర్ | ద్వారపూడి సెక్టార్ | 9381215076 |
| ఐసీడీఎస్ సూపర్‌వైజర్ | ఏడిద సెక్టార్ | 9030301587 |
| వైద్యాధికారి | సీహెచ్.రమ్యశ్రీ | 9652502519 |
| వైద్యాధికారి | పి. జగదీష్ | 9494029992 |
| వైద్యాధికారి | లత | 9177724823 |
| వైద్యాధికారి | సూర్యనారాయణరెడ్డి | 9849131854 |
| పశువైద్యాధికారి | రాజ్‌కుమార్ | 7989535625 |
| డ్రైయినేజ్ ఏఈఈ | సాయిచంద్రిక | 8886066939 |
| ఎక్సైజ్ సీఐ | వి. నాగేశ్వరరావు | 9959818277 |
| ఏపీఎస్ ఆర్టీసీ డీఎం (రామచంద్రపురం) | కె. వెంకటేశ్వర్లు | 9959225536 |
| ఉద్యానవన శాఖాధికారి | ఎం. అనూష | 8712625211 |

## ఘనంగా అయ్యప్ప స్వామి నగరయాత్ర



అయ్యప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న స్వాములు



రథయాత్రలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

### శరణు ఘోషతో మార్మోగిన మండపేట

**మండపేట:** అయ్యప్ప స్వామివారి రథోత్సవం పట్టణంలో ఆదివారం కన్నుల పండువగా సాగింది. ఆలయ కమిటీ చైర్మన్‌ఎస్‌వీ.సాయికుమార్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్య సంబూద్రి పర్యవేక్షణలో లక్ష్మీగణపతి హోమం, పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణలు, దేవతా మూర్తుల వేషధారణలతో స్వామివారి ఊరేగింపు ఘనంగా సాగింది. అయ్యప్పస్వామి వారి ఆలయం వద్ద నుంచి కలువ పువ్వు సెంటర్, కరాచీ సెంటర్, బస్టాండు, రాజారత్న సెంటర్ల మీదుగా అయ్యప్పస్వామి వారి నగరయాత్ర శోభాయమానంగా సాగింది. బాణసంచా కాలుస్తూ, రంగులు చల్లుకుంటూ స్వాములు ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా స్వాములు స్వామి శరణుఘోషతో పట్టణం మార్మోగింది. ×స్వామి దింతకతోం.. అయ్యప్ప దింతక తోం¥ నామస్మరణతో పడి వేసి వేస్తూ స్వామి వారి రథాన్ని ముందుకు నడిపించారు. పట్టణ ప్రజలు, పరిసర ప్రాంతాల నుంచి మండపేట వచ్చిన ప్రజలు స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం రాత్రి పెద్ద ఎత్తున స్వామివారి పడిపూజ జరిగింది. మండపేట, పరిసర గ్రామాల నుంచి వందలాదిగా స్వాములు పాల్గొన్నారు.

## గోతులమయంగా నరజాడ రహదారి



అధ్వానంగా మారిన నరజాడ-అముజూరు రహదారి

**కె.గంగవరం:** మండలంలోని అముజూరు– నరజాడ రహదారి గోతులమయంగా మారింది. ఈ రహదరి నిర్మించి సుమారు ఎనిమిదేళ్లవుతోంది. పక్కనే పంట కాలువ ఉండడం వల్ల రోడ్డు కోతకు గురైంది. మరోవైపు సుమారు నాలుగు కిలోమీటర్లు ఉండే ఈ రహదారిలో ఎక్కడపడితే అక్కడ గుంతలు పడి మరీ అధ్వానంగా మరింది. కూళ్లమల్లవరం, నరజాడ గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తున్నారు. రహదారి సరలేక పోవడంతో రోజులు ఈ గ్రామం నుంచి వాకతిప్ప వెళ్లే బస్సు కూడా రావడం లేదని దీంతో నానా అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.